నేటి నుంచి గొర్రెల పంపిణీ

- 192 యూనిట్ల పంపిణీకి రంగం సిద్ధం
- మూడేళ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- మిగతా గొర్రెల యూనిట్లను ఆగస్టు వరకు పంపిణీ

సాక్షి, మేడ్చల్ జిల్లా: రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని.. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని సంక్షేమ సంబురాల్లో భాగంగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలో రెండో విడత గొర్రెల పంపిణీకి అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ఈ ఉత్సవాల నుంచి రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభించి.. ఆగస్టు చివరి నాటికి పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో మిగిలిన లబ్ధిదారులకు మేలుచేకూరనుంది. కుల వృత్తులకు జీవం పోయాలని నిర్ణయించిన ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. అందులో భాగంగా నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని గొల్ల, కురుమలకు రాయితీపై గొర్రెలను ఇవ్వడం ద్వారా ఉపాధి చూపిస్తోంది. గొల్ల కురుమలను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం ఏప్రిల్ 2017న గొర్రెల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాయితీపై రెండు విడతలుగా వీటిని పంపిణీ చేయాలని నిర్ణయించింది.



సంబురాల్లో 192 గొర్రెల యూనిట్ల పంపిణీ

తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నగర శివారు జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో 24 గొర్రెల యూనిట్ల చొప్పున 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 192 గొర్రెల యూనిట్లను సంబంధిత లబ్ధిదారులకు అందజేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది.

– మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్‌లో 24 గొర్రెల యూనిట్లు, మేడ్చల్ నియోజకవర్గం కేంద్రంలో 24 గొర్రెల యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీకి సన్నద్ధమవుతున్నారు. అలాగే, రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, షాద్‌నగర్, కల్వకుర్తి, రాజేంద్రనగర్, ఎల్బీనగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో గొర్రెల యూనిట్ల పంపిణీకి చర్యలు తీసుకుంటోంది. ఒక్కో నియోజకవర్గంలో 24 గొర్రెల యూనిట్ల చొప్పున మొత్తంగా 6 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 144 గొర్రెల యూనిట్ల పంపిణీ చేయనున్నారు.

మేడ్చల్ జిల్లాలో పంపిణీ చేయాల్సిన గొర్రెల యూనిట్లు 1,248

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు మొదటి, రెండో విడతలు కలిపి మొత్తంగా గొల్ల, కురుమలకు 5,160 యూనిట్లు పంపిణీ చేయాలని నిర్ణయించగా, ఇప్పటి వరకు 3,865 యూనిట్ల గొర్రెలను సంబంధిత లబ్ధిదారులు పంపిణీ చేశారు. సంక్షేమ సంబురాల్లో మరో 48 గొర్రెల యూనిట్లను పంపిణీ చేసేందుకు జిల్లా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటోంది. రెండో విడతలో మిగిలిన 1248 యూనిట్ల గొర్రెలను సంబంధిత లబ్ధిదారులకు ఆగస్టు వరకు పంపిణీ చేయాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన గొల్ల, కురుమలకు ఒక్కో యూనిట్ కింద 20 గొర్రెలు, ఒక పొట్టేలు కొనుగోలు చేసి.. పంపిణీ చేస్తోంది. ఈ నేపథ్యంలోనే జిల్లా పశుసంవర్ధక శాఖ గొర్రెల పంపిణీ కసరత్తులో భాగంగా డీడీలు చెల్లించని సొసైటీ సభ్యుల్లో అవగాహన పెంచేందుకు చర్యలు తీసుకుంటోంది. అలాగే, ఇతర ప్రాంతాల నుంచి గొర్రెలను మేడ్చల్ జిల్లాకు తరలించడంపై పశు సంవర్ధక శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోంది.

నేడు సంక్షేమ సంబురాలు

- లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి
- రెండో విడత గొర్రెల పంపిణీ షురూ
- మేడ్చల్ కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం తెలంగాణ సంక్షేమ సంబురాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ వంటి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధిపొందిన వెయ్యి మందికి తగ్గకుండా పాల్గొనేలా సభలు, సమావేశాలు నిర్వహించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో లబ్ధిదారులకు ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మీ, షాదీముబారక్ వంటి పథకాలను అందజేయాలన్నారు. గొల్లకురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ ప్రారంభిస్తామన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు కులవృత్తి దారులకు ఆర్థిక సాయం కింద రూ.లక్ష చొప్పున పంపిణీ చేస్తామన్నారు.



◆ కలెక్టరేట్‌లో మేడ్చల్ నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను జిల్లా మంత్రి సీహెచ్ మల్లారెడ్డి పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

◆ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలోని బాలాజీ గార్డెన్ ఫంక్షన్ హాల్, పటేల్‌నగర్, కూకట్‌పల్లి ఎన్కేఎన్ఆర్ గార్డెన్స్, ఎన్‌హెచ్–65 మెట్రో ఎదురుగా సంక్షేమ సంబురాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. రామంతాపూర్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాలు, బహదూర్పల్లిలోని మేకల వెంకటేశ్ ఫంక్షహాల్‌లో సంబరాలు నిర్వహిస్తామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ ధర్నా

సాక్షి, మేడ్చల్ జిల్లా: విద్యారంగం సమస్యలపై అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఎంఈఓ కార్యాలయం ఎదుట గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఎలాంటి గుర్తింపు, అనుమతులు లేకుండా నడిపిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. సకాలంలో పాఠ్యపుస్తకాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ మహానగర కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలన్నారు. గుర్తింపు లేకుండా అడ్మిషన్స్ తీసుకున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవంతోపాటు యాజమాన్యలపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. ప్రతి స్కూల్‌లో స్పోర్ట్స్ గ్రౌండ్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో సకాలంలో స్కూల్ యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ధర్నాలో కూకట్‌పల్లి విభాగ్ ఏబీవీపీ కన్వీనర్(రాష్ట్ర సంయుక్త కార్యదర్శి) ఆత్మకూరి శ్రీనాథ్, జిల్లా కన్వీనర్లు నాగేష్, ప్రతీక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మనోహర్, మనీషా, రాధాశ్రీ, నగర కార్యదర్శి ఆకాష్, కిషోర్, దినేష్, కార్తీక్, రాఘవేంద్ర, గణేష్, మోక్ష, సంజయ్ పాల్గొన్నారు



బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి



చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న కౌన్సిలర్ పెంటయ్య



కరీంగూడలో బడిబాట కార్యక్రమంలో సర్పంచ్ కొకుట్ల గోపాల్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 6వ వార్డు పరిధి మైసమ్మగూడలో గురువారం బడిబాట నిర్వహించారు. కౌన్సిలర్ పెంటయ్య ఆధ్వర్యంలో స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించిన అనంతరం గ్రామంలోని పలు వీధుల్లో ఉపాధ్యాయులు, చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

కరీంగూడ గ్రామంలో..

కీసర: చిన్నారులను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని కరీంగూడ సర్పంచ్ కొకుట్ల గోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం కరీంగూడ గ్రామంలో నిర్వహించిన బడిబాటలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులుంటారని, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, నోట్‌బుక్స్, మధ్యాహ్న భోజనం తదితర సౌకార్యలు కల్పించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ క్లాసులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బోడపట్ల మాధవరెడ్డి, జిల్లా సెక్టోరియల్ అధికారి హేమలత, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీందర్‌రెడ్డి, ఎస్ఎంఎస్ చైర్మన్ మహేష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

బోడుప్పల్: బోడుప్పల్ 11వ డివిజన్ హేమానగర్‌కాలనీలో రూ.40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు గురువారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీ రవిగౌడ్, కార్పొరేటర్లు కొత్త శ్రీవిద్యా చక్రపాణిగౌడ్, బొమ్మకు సుగుణమ్మ, బాలయ్య, మాజీ ఎంపీపీ కొత్త చక్రపాణిగౌడ్, బొమ్మకు బాలయ్య, బీఆర్ఎస్ అధ్యక్షులు జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్, రామకృష్ణ, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

నాలా పూడికతీత పనుల్లో వేగం పెంచండి

అల్వాల్: నాలా పూడికతీత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కార్పొరేటర్ సబిత కిషోర్ అన్నారు. వెంకటాపురం డివిజన్ పరిధిలోని వెస్ట్ వెంకటాపురం రోడ్ నంబర్–10లో గురువారం చేపట్టిన నాలా పూడికతీత పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న వర్షాకాలంలో వర్షపునీరు సజావుగా వెళ్లడానికి నాలా పూడికతీత పనులు ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ ఏసీపీ విజయశ్రీ, డీఈ కార్తీక్, ఏఈ అరుణ్, నాయకులు భాస్కర్, సంతోష్, లోకేష్, జనార్దర్, కిట్టు, ప్రభాకర్, మోసీన్, ముత్యాలు, మల్లేష్, రామకృష్ణ, శ్యామ్‌సుందర్, రఘుపతిరెడ్డి, లక్ష్మీ, కల్పన, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

కీసర: మేడ్చల్ నియోజవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టడం జరుగుతోందని టీపీసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అన్నారు. గురువారం కీసర మండల కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా కీసరకు చెందిన మీర్‌షాదిక్ అలీ రజ్వీకి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు అష్షబాయ్‌తో కలిసి నియామకపత్రాన్ని ఆయన అందజేశారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు ఏర్పడ్డాయన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. చిక్కుడు రమేష్‌ముదిరాజ్, రామిడి విజయ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జూపల్లి రవీందర్, తటాకం అభిలాష్, దయానంద్‌గౌడ్, మహ్మద్ ఎక్బాల్ పాల్గొన్నారు.



మీర్ షాదిక్ అలీ రజ్వీకి నియామకపత్రం అందజేస్తున్న సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

ప్రకృతి వనరులను కాపాడుకోవాలి



దేవరయాంజాల్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న హకీంపేట ఎయిర్‌ఫోర్స్ సిబ్బంది

శామీర్‌పేట్: ప్రకృతి వనరులను కాపాడుకోవాలని హకీంపేట ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎస్‌కే రెడ్డి అన్నారు. పర్యావరణం కోసం జీవన విధానం అనే అంశంపై గురువారం తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజాల్‌లో హకీంపేట ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ఏడు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీటి పొదుపు, చెత్తను తగ్గించడం, శక్తిని కాపాడుకోవడం, వ్యర్థాలను తగ్గించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదం, స్థిరమైన ఆహార వ్యవస్థలను, ఆరోగ్యకరమైన జీవన శైలి తదితర అంశాలపై ప్రజలకు వివరించారు. దేవరయాంజాల్‌ను దత్తత తీసుకుంటున్నామని, త్వరలోనే హకీంపేట ఎయిర్ ఫోర్స్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్‌లను నిర్వహిస్తామని వారు తెలిపారు. దేవరయాంజాల్ అభివృద్ధికి శక్తిమేరా కృషి చేస్తామని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్ బాబు, మెడికల్ ఏకే సింగ్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ రాజీవ్, సీనియర్ సెక్యూరిటీ ఇన్‌చార్జి అజయ్, మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రంరెడ్డి, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, ఎయిర్ ఫోర్స్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహించేందుకే క్రీడాపోటీలు

కీసర: యువతను క్రీడల్లో ప్రోత్సహించేందుకు మేడ్చల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని బీఆర్ఎస్ కీసర, ఘట్‌కేసర్ మండలాల ఇన్‌చార్జి చామకూర భద్రారెడ్డి అన్నారు. గురువారం కీసరలో సీఎంఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి కింద రూ.50 వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.25 వేల నగదు అందజేస్తామన్నారు. మండల పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ ఎన్.మాధురి, మాజీ ఎంపీపీ రామారం సుజాత, ఎంపీటీసీ సభ్యుడు తటాకం నారాయణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్, బీఆర్ఎస్ కీసర మండల యూత్ అధ్యక్షుడు తటాకం భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.



కీసరలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చామకూర భద్రారెడ్డి

ఘనంగా ఊరూరా చెరువుల పండగ



చౌదరిగూడలో అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి



అవుషాపూర్‌లో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కొండల్‌రెడ్డి తదితరులు



నాగారం అన్నరాయిని చెరువు వద్ద మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

ఘట్‌కేసర్: చౌదరిగూడ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయం ఆవరణ, వెంకటాపూర్ నాడెం చెరువు వద్ద చౌదరిగూడ, వెంకటాపూర్, కొర్రెముల్ పంచాయతీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఊరూరా చెరువుల పండగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఏదులాబాద్, అవుషాపూర్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ ప్రకాశ్, డీపీఓ రమణామూర్తి, డీఎల్పీఓ స్మిత, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచులు రమాదేవి, గీత, వెంకటేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు రామారావు ముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, వినోద, కార్యదర్శులు గౌతమి, కవిత, లింగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, రమేశ్, స్థానిక శాఖ అధ్యక్షుడు లింగంయాదవ్, మాజీ సర్పంచ్ రాములుగౌడ్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చెరువుల పండుగ

కీసర: చెరువుల పండగను మండలంలోని వివిధ గ్రామాలతో పాటు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో గురువారం చెరువుల వద్ద చెరువుల పండగను ఘనంగా నిర్వహించారు. కీసరలోని చెరువు వద్ద నిర్వహించిన చెరువుల పండగలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. నాగారం అన్నరాయిని చెరువు వద్ద మున్సిపల్ చైర్మన్ కొకుట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు. సర్పంచులు మాధురి, ఆకిటి మహేందర్‌రెడ్డి, సత్తమ్మ, పెంటయ్య, ధర్మేందర్, విమల, పుట్టరాజు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

ఎగుమతి చేసే స్థాయికి..

శామీర్‌పేట్: తెలంగాణకు చేపలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం మేడ్చల్ జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమాన్ని శామీర్‌పేట పెద్దచెరువు వద్ద నిర్వహించారు. చెరువు వద్ద ఏర్పాటు చేసిన స్టాల్‌ను కలెక్టర్ అమయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహరెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, స్థానిక ఎంపీపీ యెల్లుబాయి, జెడ్పీటీసీ అనిత, పలువురు ప్రజాప్రతినిధులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఊరూర చెరువుల పండగ

మేడ్చల్‌రూరల్: చెరువుల పండగను గురువారం ఘనంగా నిర్వహించారు. కట్టమైసమ్మ ఆలయాన్ని అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి బోనాలు సమర్పించారు. చెరువుల పండగలో మేడ్చల్ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, ఎంపీడీఓ పద్మావతి, జిల్లా రైతు బంధు అధ్యక్షులు నందారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట పెద్దచెరువు వద్ద స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి



నూతన్‌కల్‌లో వేడుకల్లో ఎంపీపీ, ఎంపీడీఓ



మైసిరెడ్డిపల్లిలో చెరువు వద్ద..

'డబుల్' ఇళ్ల హామీ ఏమైంది..?



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్

అల్వాల్: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన రెండు పడకల గదుల నిర్మాణ హామీని బీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందని, కేవలం పార్టీ కార్యాలయాల నిర్మాణం పైనే దృష్టి సారించిందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. అల్వాల్ సర్కిల్ ఏ–బ్లాక్ విభాగం ఆధ్వర్యంలో గురువారం అల్వాల్‌లో నిర్వహించిన దీక్ష శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఓట్ల కోసం రెండు పడకల గదుల నిర్మాణం చేస్తామని, ప్రజలకు కాకమ్మ కథలు వినిపించిన రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారంలోకి రాగానే పరిపాలన భవనాలు, పార్టీ కార్యాలయాల నిర్మాణాల పైనే దృష్టి సారించారన్నారు. వేలాది మంది దరఖాస్తు చేసుకొని సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ అతీగతీ లేదన్నారు. అల్వాల్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం కోసం శిలాఫలకాన్ని ఏర్పాటు చేసి 9 సంవత్సరాలు కావొస్తోందన్నారు. నేటికీ 9 ఇళ్లు కూడా నిర్మించలేదని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అర్హులైన వారందరికీ రెండు పడకల గదులను కేటాయించాలన్నారు. లేదంటే కాంగ్రెస్ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అశోక్‌రెడ్డి, చంద్రశేఖర్, క్రిష్ణగౌడ్, శ్రీపాల్‌రెడ్డి, సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీనివాసులు, సంతోష్‌రెడ్డి, పవన్, ఓంకార్, పాండు, వీనస్‌మేరి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు



టమాటో తోటలో బోర్డును ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ విశ్వనాథ్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని సర్వే నంబర్–226 టమాటో తోటలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఆర్ఏ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అవుషాపూర్‌లో డ్రైనేజీ పనులు ప్రారంభం



అవుషాపూర్‌లో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, సర్పంచ్ కావేరి

ఘట్‌కేసర్: అవుషాపూర్ వేణుగోపాల్ నగర్‌లో సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.2.5 లక్షల మండల నిధులతో నిర్మిస్తున్న అంతర్గత మురుగు కాలువ నిర్మాణం పనులను గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరై భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, వార్డు సభ్యుడు పద్మ, వీరేశ్, శ్రీనివాస్‌గౌడ్, నాయకులు మశ్చేందర్‌రెడ్డి, వామన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

ఆలయానికి మైక్‌సెట్ విరాళం



కీసర: కీసర శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయానికి కీసర గ్రామానికి చెందిన నల్ల వెంకట్‌రెడ్డి సుమారు రూ.30 వేల విలువచేసే మైక్‌సెట్‌ను గురువారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ వేదపండితులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఆలయ చైర్మన్ నాయకపు వెంకటేష్, కన్వీనర్ పన్నాల సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి, కీసరగుట్ట ట్రస్టు బోర్డు సభ్యుడు గుర్రం లక్ష్మారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రాయిల శ్రవణ్‌కుమార్‌గుప్తా, బీఆర్ఎస్ సీనియర్ నేత గుర్రం మల్లారెడ్డి, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు బండారి శ్రీనివాస్‌రెడ్డి, నేతలు మెట్టు మహేందర్‌యాదవ్, జేసీబీ మురళి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి వెండి కిరీటం అందజేత



ఘట్‌కేసర్: ఏదులాబాద్ శ్రీభ్రమరాంబిక మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుడు శ్రీసాయి మోటార్స్ యజమాని పోలు భాస్కర్‌గౌడ్, రూప్సీరాణి దంపతులు మంగళ వాయిద్యాలతో కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి వెండి కిరీటం, మకర తోరణం రుత్వికుల సమక్షంలో అమ్మవానికి సమర్పించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గౌతంనగర్: నిరుద్యోగ యువత రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. గౌతంనగర్ డివిజన్ పరిధిలోని యాదవనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్నేహ చికెన్ సెంటర్‌ను ఆమె గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మేకల రాముయాదవ్, నిర్వాహకులు నరేందర్, శ్యామ్ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాల అందజేత

మేడిపల్లి: తెలంగాణ రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా పీర్జాదిగూడ మున్సిపాలిటీ పరిధిలో పలు వీధి కుక్కలను దతత తీసుకున్న 24వ డివిజన్ కాలనీవాసులకు గురువారం 24వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి శంకర్, కమిషనర్ వంశీ చేతులమీదుగా ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాలొన్నారు.